క్లుప్తంగా

రేపటి నుంచి అయ్యప్ప స్వామి దేవాలయంలో భిక్ష

గుంటూరు వెస్ట్: బ్రాడీపేట 5/7లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం నుంచి జనవరి 3 వరకు స్వాములకు భిక్ష (అన్న ప్రసాదం) నిర్వహిస్తామని గురుస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 41 రోజుల పాటు రాత్రి 8 గంటలకు భజన అనంతరం భిక్ష జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్


గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డు(225)లో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అయితే, సిబ్బంది అప్రమత్తతతో అదుపులోకి తెచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఆయన చెప్పారు. వార్డులో ఏసీ నుంచి మంటలు వస్తున్నాయని సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్ చేరుకుని, సిబ్బంది అప్రమత్తం చేసి అదుపులో తెచ్చినట్లు తెలిపారు. రోగుల్ని వెంటనే మరో వార్డుకు తరలించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. మంటల్లో కాలిపోయిన ఏసీ మిషన్, ఎలక్ట్రిక్ బాక్స్‌లను తొలగించి, వ్యాపించిన పొగల్ని అదుపులోకి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులకు సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో వార్డును యథాస్థితికి తీసుకు వస్తామని ఆయన చెప్పారు. సకాలంలో స్పందించిన వైద్య సిబ్బందిని అభినందించారు. విషయాన్ని హెచ్‌డీఎస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, డీఎంఈ డాక్టర్ నరసింహం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

టీఎంబీ క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు జట్టు



కొరిటిపాడు: ప్రముఖ ప్రైవేటు బ్యాంకు తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు (టీఎంబీ) లిమిటెడ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజప్పన్ ఆదేశాల మేరకు బ్రాంచి మేనేజర్ దినకర్ జేబా కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. గుంటూరు - విజయవాడ జట్ల ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో గుంటూరు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన గుంటూరు జట్టుకు, పాల్గొన్న వారికి ఏపీ టెక్స్‌టైల్స్ అండ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరవల్లి కోటిరావు, తిరుమల కాటన్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్ డైరెక్టర్ కరణం పట్టాభి సీతారామారావు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 3,4 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ 'భారతదేశంలో నిజమైన సమగ్ర అభివృద్ధి దిశగా: మహాత్మా జ్యోతిరావు పూలే భావజాలం , సామాజిక ఆచరణ ఔచిత్యం' అనే అంశంపై వచ్చే జనవరి 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించే వారు డిసెంబరు 15వ తేదీలోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, మహాత్మా జ్యోతిరావ్‌పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో నివసించే 17 సంవత్సరాల వేణుగోపాల్ ఆదివారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సిబ్బంది సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని యువకుడ్ని గుర్తించిన వారు 9705643699 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జగన్ ప్రభుత్వానికే మళ్లీ ప్రజల మద్దతు

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- శ్యామలానగర్, ఏటీ అగ్రహారం జీరోలైనులో 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహణ



నవరత్న పథకాల లబ్ధిదారుల డిస్‌ప్లే ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమాభివృద్ధి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే మళ్లీ ప్రజలు మద్దతు పలుకుతున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 35వ డివిజన్ పరిధిలోని శ్యామలానగర్, 31వ డివిజన్‌లోని ఏటీ అగ్రహారం జీరో లైనులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ ఆయా సచివాలయాల్లో సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కూడిన బోర్డుల్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు చేసిన మంచిని ప్రజలకు తెలియచేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటిని అమలు పరచని వైనాన్ని సైతం ప్రజలకు సోదాహరణంగా వివరిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల తీరును తెలుసుకునే కొత్త ఒరవడికి సీఎం వై.ఎస్. జగన్ శ్రీకారం చుట్టారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం తమ ప్రభుత్వంలోనే జరుగుతోందన్నారు. మహిళా సాధికారతలో చేయూత, ఆసరా, అమ్మఒడి, సున్నావడ్డీ, మహిళల పేరుమీదే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌తో పాటు విద్యాకానుక, విద్యాదీవెన, రూ.20 వేలు వసతి దీవెన వంటివి గతంలో జరుగలేదని గుర్తు చేశారు. ఏ పథకం ఎప్పుడు వస్తుందనేది ముందుగానే క్యాలెండర్ ప్రకటించి, అవినీతి, వివక్షకు తావు లేకుండా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితిలో ఉన్నా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తూ, ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడే అనేక పథకాల్ని ఇచ్చినమాట ప్రకారం సీఎం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మేనిఫెస్టోలో పొందుపరచిన నవరత్నాలే కాకుండా చెప్పని వాటిని సైతం 99శాతం అమలు చేసిన ఏకైక సీఎం వై.ఎస్. జగన్ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన చేస్తున్నారని తెలిపారు. ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడి, మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. క్లస్టర్ - 2 అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన పథకాల్ని ప్రజలు నిశితంగా పరిశీలించి, స్వయంగా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్, సామాజిక సాధికారత యాత్ర కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా లభిస్తున్న అనూహ్య స్పందనే అందుకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, టి.ఎల్.వి.వీరాంజనేయులు, అడకా పద్మావతి, సాధు రాజేష్, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, పడాల సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంగడి శ్రీనివాసరావు, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ గుంటూరు క్లస్టర్ - 3 అధ్యక్షుడు బత్తుల దేవానంద్, నేతలు మార్కెట్ బాబు, సురసాని వెంకటరెడ్డి, మిర్చి యార్డు డైరెక్టర్ ప్రభ, మాణిక్యరావు, టి.ఎల్.వి.పవన్, సురేష్, సాగర్, రమణ, ఉడతా కృష్ణ, దాసరి రమేష్, మేరువ నర్సిరెడ్డి, చల్లా కోటి, అశోక్, జన్నత్, కోట వెంకటేష్, గోపి పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక శోభ

- భక్తిశ్రద్ధలతో మొదటి సోమవారం పూజలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



కొత్తపేట శివాలయంలో బారులుతీరిన భక్తులు



మల్లికార్జునపేట శివాలయంలో విశేష అలంకారంలో స్వామి

పాత గుంటూరు: కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఈశ్వరుని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు విశేషంగా తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. శైవక్షేత్రాల్లో వివిధ రూపాల్లో కొలువైన పరమేశ్వరుడికి అర్చకులు, వేదపండితులు అభిషేకాలు, కుంకుమార్చనలు, దీపారాధనలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో కార్తిక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ మొగిలి సతీష్ కుమార్, ఈవో తమ్మ శివారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు దండిభోట్ల వేణుగోపాల్ స్వామికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పరమ శివుడ్ని దర్శించుకున్నారు.

శ్రీమల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఉత్సవమూర్తుల్ని దర్శించుకున్నారు. అర్చకులు సాయంత్రం ప్రత్యేక హారతి ఇచ్చారు.

గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విజ్ఞానాభివృద్ధి



గార్డెన్స్ గ్రంథాలయంలో విద్యార్థులతో శకుంతల, సత్య శిరీష



ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో వెంకాయమ్మ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విజ్ఞానాభివృద్ధికి బాటలు వేసుకోవచ్చని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నరసం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.వి.కె. సుజాత, మైనింగ్ శాఖ మేనేజర్ డి. రామచంద్రారెడ్డి, విశ్రాంత లైబ్రేరియన్ మురళీకృష్ణ, న్యాయవాది ఎం. మృత్యుంజయరావు, గ్రంథాలయాధికారులు బి. శకుంతల, పి. సత్య శిరీష, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.
- ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ ఉపాధ్యాయులు, రికార్డు అసిస్టెంట్ బి. వెంకాయమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

వ్యాస రచన, క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెహ్రూనగర్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బృందావన్ గార్డెన్స్‌లోని గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీల్లో గుంటూరు పట్టాభిపురం హైస్కూలు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన తస్వీర్, దీక్ష, రవళి, వెంకటేష్, అప్స, కుసుమాంజలి, టైటాన్స్ విజయరాజు, కావ్యలను సోమవారం పాఠశాలలో హెచ్ఎం డి. కల్యాణి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నేటి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు సరిత, ఈశ్వరి, రత్నకుమారి పాల్గొన్నారు.



ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు



ప్రతిభ చూపిన పట్టాభిపురం హైస్కూలు విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అధ్యాపకురాలు లక్ష్మీ తిరుపతమ్మకు నేషన్ బిల్డర్ అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ గుంటూరు ఉడాన్ ఆధ్వర్యంలో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకురాలు చల్లా లక్ష్మీ తిరుపతమ్మ నేషన్ బిల్డర్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య సంస్థలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా తమ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ తిరుపతమ్మను కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, అధ్యాపకులు అభినందించారు.

ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే కీలకం



మాట్లాడుతున్న యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్

లక్ష్మీపురం: ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే కీలకమని ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. టి.ఎన్ శేషన్ లాంటి కమిషనర్లు ఉన్నప్పుడే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయని అభిప్రాయపడ్డారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్రపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను సక్రమంగా నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల కమిషన్‌పై ఉంచారని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గంలో గెలుపు కోసం కోట్ల రూపాయలు గుమ్మరిస్తున్నారన్నారు. నియమావళి, నిబంధనలు ఫైళ్లకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో శేషన్ లాంటి నిజాయతీపరుడైన అధికారి ఉంటేనే ఈసీ స్వయం ప్రతిపత్తి, సమగ్రత నిలబడతాయని తెలిపారు.

ఎస్‌బీఐ క్లరికల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్‌బీఐ క్లరికల్ ప్రిలిమ్స్ పరీక్షకు డిసెంబర్ 2నుంచి ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు శ్రీషిర్డీ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు వై. అనురాధ సోమవారం తెలిపారు. ఇంగ్లిష్, అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టుల్లో అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుల కోసం అమరావతి రోడ్డు నగరాలులోని బాలాజీనగర్ 8వ లైనులో గల ట్రస్ట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9704789299, 8686215922 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు నిప్పంటించిన ఆగంతకులు



పట్నంబజారు: గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌పోర్ట్ లారీల్ని తగులబెట్టిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాలాపేటలోని గ్రంధి ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన రెండు లారీల్ని ఆదివారం రాత్రి ఏటుకూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి నిప్పంటించడంతో అవి తగులబడ్డాయి. అందులో పార్సిల్స్, చెప్పులు, ఎరువులతో పాటు పలు రకాల వస్తువులున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. సుమారు రూ. 30 లక్షల మేరకు నష్టం జరిగి ఉంటుందని తెలుస్తోంది. ట్రాన్స్‌పోర్టు యజమాని గ్రంధి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'స్పందన' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి 'జగనన్నకు చెబుదాం', 'స్పందన'కు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని చెప్పారు. విభాగాల వారీగా 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం సంబంధిత ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 27 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 9, ఇంజినీరింగ్ విభాగానికి- 9, రెవెన్యూ విభాగానికి- 2, ప్రజారోగ్య విభాగానికి- 5, ఉపా సెల్ విభాగానికి- 2 చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. నిర్దేశిత గడువులోగా , ఫిర్యాదుల్ని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, రవీంద్ర, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నగరంలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం
- ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన 86 అంశాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో రూ. 30 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనుల్ని నిర్వహించడానికి స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినట్లు చైర్మన్, మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం మేయర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన 86 అంశాలకు సంబంధించిన అంచనాలకు, అధికారులు ప్రతిపాదనలు చేసిన అభివృద్ధి పనులకు సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు చేసుకోవడానికి పెద్ద ఫంక్షన్ హాల్స్‌కి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ప్రాంతాల్లో నగరపాలక సంస్థ తరపున కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని తెలిపారు. నగరంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామని చెప్పారు. విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు సంకూరి శ్రీనివాసరావు, కాంద్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేడ్కర్, శ్యామల వెంకటరమణాదేవి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సీపీ ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధుల తోట ఏర్పాటుకు స్థల పరిశీలన



క్రిస్టియన్ నాయకులతో కలసి స్థల పరిశీలన చేస్తున్న బాలస్వామి

నెహ్రూనగర్: గుంటూరులో క్రైస్తవుల సమాధుల తోట ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మద్దు బాలస్వామి పేర్కొన్నారు. క్రైస్తవుల మరణాంతరం సమాధి చేయడమనేది రెండు వందల యాభై సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. నగరంలో సమాధుల తోటను ఏర్పాటు చేయాలని గతంలో అనేక క్రైస్తవ సంఘాలు ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఈ మేరకు నగరంలోని పొత్తూరు జగనన్న కాలనీ దగ్గరలో ఉన్న 16.53 ఎకరాల కొండ పోరంబోకు భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఆయన సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని పొత్తూరులో ఉన్న సర్వే నంబర్ 529, 530, 531లోని 16.53 ఎకరాల కొండ పోరంబోకు భూమిని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ శామ్యూల్ జోనాథన్, వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ గుంటూరు నగరంలోని సమాధుల తోటలోని స్థలం 15 సంవత్సరాల కిందటే నిండిపోవడంతో గత్యంతరం లేక ఒకే సమాధిలో నాలుగు మృతదేహాల్ని ఖననం చేసే దుస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే అంగీకరించడంతో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, క్రైస్తవుల సమాధుల తోట సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, నగరపాలక సంస్థ అధికారులతో కలసి యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ప్రభుత్వాల లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

చినలింగాయపాలెం(కాకుమాను): ప్రతి కుటుంబానికీ సొంతిల్లు కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని చినలింగాయపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆవాస్ దీవాస్, ఆవాస్ సప్తాహ్ అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో దేశ ప్రధాని ఆవాస్ దీవాస్, ఆవాస్ సప్తాహ్ పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. దీనిలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.1.80 లక్షలను అందిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సత్యనారాయణ, సర్పంచ్ యోహోను, ఎంపీటీసీ సభ్యుడు జూపూడి ఏసేబు పాల్గొన్నారు.

నల్లపాడు శివాలయంలో పూజలు

గుంటూరు రూరల్: కార్తిక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని నల్లపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామికి అభిషేకాలు, పూజలు, హోమాలు, రుద్రాభిషేకాలు, పంచామృతాషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామికి సహస్ర నామార్చనలు సప్త హారతులు సమర్పించారు. తీర్థ ప్రసాదాల్ని పంపిణీ చేశారు.